క్లుప్తంగా

ప్రజలకు దసరా శుభాకాంక్షలు



ఎమ్మెల్యే రోహిత్

మెదక్‌జోన్‌: నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో దసరా పండుగ జరుపుకోవాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం విజయ దశమి పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తులు సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగ జరుపుకొంటామన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, అన్నింటా విజయాలు సిద్ధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.



పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌ మున్సిపాలిటీ: జిల్లాలోని ప్రజలంతా దసరా పండుగను ఆనందోత్సవాల నడుమ సుఖసంతోషాలతో జరుపుకోవాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలను తెలిపారు. విజయానికి చిహ్నంగా విజయ దశమి పండుగను జరుపుకుంటున్నట్లు వెల్లడించారు.

ఘనంగా పల్లకీ సేవ



బగలాముఖీ అమ్మవారి పల్లకీసేవలో ఎమ్మెల్యే సునీత, మాజీ జెడ్పీటీసీ, భక్తులు

నర్సాపూర్‌: శివ్వంపేటలోని బగలాముఖీ అమ్మవారి శక్తి పీఠం ఆలయంలో దేవీశరన్నవ రాత్రుల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరశర్మ, మాజీ జెడ్పీటీసీ మహేష్‌గుప్తాల ఆధ్వర్యంలో పూజలు, హోమం అనంతరం అమ్మకు పల్లకీ సేవ కార్యక్రమాలను చేపట్టారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు ఆయా పార్టీల నాయకులు భక్తులు పాల్గొన్నారు. పల్లకీ సేవలో సునీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ బగలాముఖీ అమ్మ శక్తి పీఠం శివ్వంపేటలో ప్రతిష్ఠించడం అందరి అదృష్టమన్నారు. కార్యక్రమాల్లో మండలంలోని నాయకులు పబ్బరమేశ్‌గుప్తా, చంద్రాగౌడ్‌, మన్సూర్‌, హరికృష్ణ, రమణగౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌



ఏడుపాయల్లో కృష్ణారావు

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల దుర్గమ్మను శుక్రవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం డైరెక్టర్‌ కృష్ణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పార్థివశర్మ ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. ఆపై తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు మల్లారెడ్డి, టీచర్లు అంజాగౌడ్‌, పంతు రమేశ్‌, నరేందర్‌ రెడ్డి, రమేశ్‌ ఉన్నారు.

మొండితండా వాసికి ఎస్‌ఏ ఉద్యోగం



డీఈఓ నుంచి ఉద్యోగ నియామక పత్రం అందుకుంటున్న పీన

కౌడిపల్లి(నర్సాపూర్‌): విద్యకు పేదరికం అడ్డు కాదని చాటిచెప్పింది పీన. వారిది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వారి కాయకష్టం చూసి నిరంతరం కష్టపడి చదివింది. ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదల కాగా బయాలజికల్‌సైన్స్‌లో 36వ ర్యాంక్‌ సాధించింది. స్కూల్‌ అసిస్టెంట్‌ ఉద్యోగం సాధించడం, డీఈఓ చేతులమీదుగా నియామక పత్రం సైతం అందుకోవడం జరిగింది. ఆ మేరకు తల్లిదండ్రులు కాట్రోత్‌ పీర్యనాయక్‌, చిక్కిల సంతోషానికి అవధులు లేకుండా ఉంది. పీనను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



నర్సాపూర్‌: మహిషాసుర మర్దినిగా..



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో..



రేగోడ్‌: చౌదర్‌పల్లిలో..

అమ్మ వైభవం..

భక్తుల పరవశం

దేవీశరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయాలు, మండపాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో దర్శమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో సందర్శించారు. పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం మొక్కులు చెల్లించారు.



పెద్దశంకరంపేట: రామోజిపల్లిలో పూజలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నర్సాపూర్‌: మహాచండీ హోమం..



కౌడిపల్లి : వెల్మకన్నలో ..



కౌడిపల్లిలో బోనాలతో యువతులు



పెద్దశంకరంపేట: మహిళల కుంకుమార్చన



చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): అజ్జమర్రిలో..



తూప్రాన్‌లో..

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాల్సిందే

● సంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు బుచ్చేంద్ర



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): ఏఎస్‌ఐ సుధారాణిని వేధించిన ఎస్‌ఐ యాదగిరిపై ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్‌ అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర అన్నారు. శుక్రవారం పలు దళిత సంఘాల నాయకులతో కలిసి ఆయన చిలప్‌చెడ్‌ ఏఎస్‌ఐ సుధారాణి ఆత్మహత్యాయత్నంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ , ఎస్‌ఐ వేధింపులతోనే ఏఎస్‌ఐ ఆత్మహత్యా యత్నం చేసిందన్నారు. ఈ విషయమై ఎస్‌ఐని ప్రశ్నిస్తే ఆయన అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నాడని ఆరోపించారు. ఏఎస్‌ఐ కుటుంబసమస్యల కారణంగానే ఆత్మహత్యాయత్నం చేసిందని సమాధానం ఇచ్చారన్నారు. బాధితురాలికి న్యాయం చేసే వరకు తమ పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి గందగల్ల ప్రసాద్‌, నాయకులు మొగులయ్య, దుర్గాదాస్‌, లింగం, కృష్ణ, ఆనంద్‌లు పాల్గొన్నారు.

సామాజిక పరివర్తనకు ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రాధాన్యం



ధ్వజానికి వందనం చేస్తున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్‌, స్వయం సేవకులు

జహీరాబాద్‌: ఆర్‌ఎస్‌ఎస్‌ అంచలంచెలుగా ఎదుగుతూ సామాజిక పరివర్తన తీసుకురావాలనే లక్ష్యంతోనే ఎదిగిందని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌, ఆర్‌ఎస్‌ఎస్‌ సహ ప్రాంత ప్రచారక్‌ కల్పగూరు ప్రభుకుమార్‌ అన్నారు. సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్‌ సంఘ్‌(ఆర్‌ఎస్‌ఎస్‌) పథసంచాలన్‌ కార్యక్రమం నిర్వహించింది. శుక్రవారం మార్కండేశ్వర ఆలయం నుంచి పథసంచాలన్‌ ప్రారంభమైంది. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ నేతలు రూట్‌మార్చ్‌లో పాల్గొన్నారు. అనంతరం ప్రభుకుమార్‌ మాట్లాడుతూ 1925 సంవత్సరం విజయదశమి రోజున కొంతమంది కార్యకర్తలతో సంఘం ప్రారంభమైందన్నారు. విజయదశమి సందర్భంగా శతజయంతి ఉత్సవాలను జరుపుకోవడం జరుగుతోందన్నారు. భారతదేశం పూర్వ వైభవస్థితికి చేరుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పథసంచాలన్‌లో 500 మందికి పైగా స్వయం సేవకులు పాల్గొన్నారు. సంఘ నాయకులు నవల్‌కిషోర్‌ సారడా, సురేశ్‌కులకర్ణి, మహేశ్‌, బోయిని శ్రీనివాస్‌, మంగలి విఠల్‌, తపస్‌ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, వివిధ క్షేత్రాల సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగవు: కాంగ్రెస్‌

వెల్దుర్తి(తూప్రాన్‌): వెల్దుర్తి మండలంలో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు అన్నదమ్ముల్లా కలిసి ఉంటారని కానీ ఎమ్మెల్యే తన వ్యాఖ్యలతో రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరి కాదని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మహేశ్‌ రెడ్డి, జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి విమర్శించారు. మండల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారిక కార్యక్రమంలో చెక్కుల పంపిణీ గురించి మాట్లాడకుండా ప్రభుత్వాన్ని విమర్శించడానికి రాజకీయ వేదికగా మార్చడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్‌, రుణమాఫీ, రూ.500లకే సిలిండర్‌ వంటి పథకాలు అమలవుతున్నా ఎమ్మెల్యే కంటికి అభివృద్ధి పథకాలు కనబడటం లేదా? అని ప్రశ్నించారు. మాసాయిపేట మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఫిషరీస్‌ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ వైస్‌ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల దొంగల గుర్తింపు!

ప్రధాన నిందితుడిగా మిన్‌పూర్‌ వాసి

పాపన్నపేట(మెదక్‌): ఎట్టకేలకు ఏడుపాయల దొంగలను పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. ఆగస్టు 9న గుర్తు తెలియని దొంగలు దుర్గమ్మ ఆలయంలోకి చొరబడి రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ గుర్తించబడలేదు. ఈ క్రమంలో ఇటీవల ఆంధ్రాలో జరిగిన దొంగతనం కేసులో ఓ ముఠాను విచారించగా ఈ విషయం సైతం వెలుగులోకి వచ్చింది. ఏడుపాయలతోపాటు వర్గల్‌ సరస్వతీ ఆలయంలో చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. అయితే, పాపన్నపేట మండలం మిన్‌పూర్‌ గ్రామానికి చెందిన ఓ యువకుడు, ఆంధ్రప్రాంతానికి చెందిన ముగ్గురు దొంగలతో కలిసి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి విచారణ జరుపుతామని తెలిపారు.

హామీల అమలు బాధ్యత కాంగ్రెస్‌దే



నర్సాపూర్‌: కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్‌: ఎన్నికల సమయంలో హామీల అమలు బాధ్యత కాంగ్రెస్‌ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. శుక్రవారం నర్సాపూర్‌ స్థానిక రైతు వేదికలో, శివ్వంపేటలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌ చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్‌దేనన్నారు. ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులకు వారి వివాహం భారం కావద్దన్న ఉద్దేశంతో మాజీ సీఎం కేసీఆర్‌ కల్యాణలక్ష్మి, షాదీది ముబారక్‌ పథకం అమలు చేశారని గుర్తు చేశారు. ఈ రెండు పథకాలకు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్‌ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందన్నారు. లబ్ధిదారులకు ఆ మేరకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కేసీఆర్‌ మహిళలను గౌరవించాలన్న ఉద్దేశంతో బతుకమ్మ పండుగకు చీరలు అందజేసి గౌరవించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం బతుకమ్మ చీరలు, ఐదు వందల రూపాయలు ఇస్తానని ఏదీ ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్‌ విఫలం చెందిందని ఆరోపించారు. నర్సాపూర్‌ మండలంలో 81 మందికి, శివ్వంపేటలో 57 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఏదైనా సాధ్యమే..

● డిస్ట్రిక్‌ క్రైమ్‌ రికార్డ్‌ బ్యూరో సీఐ మదుసూధన్‌గౌడ్‌



వెల్దుర్తి(తూప్రాన్‌): రవీందర్‌ను సన్మానిస్తున్న సీఐ

వెల్దుర్తి(తూప్రాన్‌): కృషి, పట్టుదల ఉంటే మనిషి ఏదైనా సాధిస్తారని డిస్ట్రిక్‌ క్రైమ్‌ రికార్డ్‌ బ్యూరో సీఐ మధుసూదన్‌గౌడ్‌ అన్నారు. భీమ్‌ వారియర్స్‌ అధ్యక్షుడు ముల్కా రవీందర్‌ ఎస్‌ఏ(ఇంగ్లిష్‌) ఉపాధ్యాయుడిగా నియామకపత్రం అందుకోగా సంఘం సభ్యులు శుక్రవారం అంబేడ్కర్‌ చౌరస్తాలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై యువకుడిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి పేదరికాన్ని జయించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఎంతోమంది విజయగాథలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలన్నారు. బాల్యంలోనే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, లక్ష్యం సాధించే వరకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌, రమేశ్‌, కుమార్‌, అశోక్‌, లింగం, సంతోశ్‌, నర్సింహులు పాల్గొన్నారు.

సన్మానం

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మండల పరిధిలోని సోమక్కపేట్‌కు చెందిన ఎరుకలి వినోద్‌ డీఎస్సీ ఎస్జీటీ పోస్టు సాధించగా.. శుక్రవారం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌ ఎంపీపీ విశ్వంభర మాట్లాడుతూ పట్టుదలతో ఏదైనా సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాచలం, సుధాకర్‌, సంగయ్య, దశరథ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించివేశారంటూ నిరసన

● ఎస్‌ఐ సర్దిచెప్పడంతో శాంతించిన ఆందోళనకారులు



వల్లూర్‌లో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్‌): దసరా శుభాకాంక్షల పేరిట వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారని నార్సింగి మండలం వల్లూర్‌లో అంబేడ్కర్‌ యూత్‌, ఛత్రపతి శివాజీ యూత్‌ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ నర్సింహులు, యువకులు మాట్లాడారు. బతుకమ్మ పండుగ రోజున గాంధీ విగ్రహం వద్ద డాక్టర్‌ అంబేడ్కర్‌, ఛత్రపతి శివాజీ చిత్రపటాలతో కూడిన దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీటిని చించేశారన్నారు. కానీ తాము శుక్రవారం ఉదయం గమనించామన్నారు. గ్రామంలోని ఒక వర్గం వారు చించివేశారని ఆరోపించారు. ఆ వర్గం వారితో తమకు చేపల చెరువు విషయమై పంచాయితీ ఉందన్నారు. వారే వాటిని చించివేశారన్నారు. ఈ విషయమై నార్సింగి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అహ్మద్‌ మోహినొద్దీన్‌ ఇక్కడికి చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పారు. దుండగులను గుర్తించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీ రఘునందన్‌కు ఆహ్వానం



ఎంపీ రఘునందన్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చందాయిపేట నాయకులు

చేగుంట(తూప్రాన్‌): వీరహనుమాన్‌ దేవాలయ వార్షికోత్సవానికి రావాలని ఎంపీ రఘునందన్‌రావుకు చందాయిపేట మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌ ఆహ్వానించారు. ఈనెల 15 నుంచి 17 వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీని ఆహ్వానించిన వారిలో నాయకులు శోభన్‌, ప్రదీప్‌, ముత్యాలు, నాగరాజు తదితరులు ఉన్నారు.

● వరి కోతలు షురూ



మహ్మద్‌నగర్‌లో వరికోత కోస్తున్న యంత్రం

కౌడిపల్లి మండలంలో యంత్రాలతో వరికోతలు చేపట్టారు. వానాకాలం ప్రారంభంలో వరి నాట్లు వేయగా ప్రస్తుతం పంటలు కోతకు వచ్చాయి. దసరా పండుగ తర్వాత పనులు మరింత ఊపందుకోనున్నాయి.

– కౌడిపల్లి(నర్సాపూర్‌):

సంక్షిప్త వార్తలు

◆ నీటి నిల్వ ఉండొద్దు



చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): ప్రతీ పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్‌ అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్‌ మండలంలోని గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. ఇంట్లో ఉన్న డ్రమ్ములు, టైర్లు, పాడేసిన కొబ్బరిబోండాలు, ఖాళీ సీసాలు, పాడైన కూలర్లలో నీటి నిల్వకు అవకాశం ఉందన్నారు. ఈ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. తద్వారా దోమలు, సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని వివిధ గ్రామాలలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. మహ్మద్‌నగర్‌గేట్‌ తండాలో ఏఎన్‌ఎం మజీదాబేగం ఆశా కార్యకర్తలు తండాలో ఇంటింటికి తిరిగి ఎక్కువ రోజులు నీరునిల్వ ఉంచవద్దని సూచించారు. వినియోగంలో లేని నీటితొట్లలోని నీటిని తొలగించారు. ప్రజలు తమ ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

◆ క్రీడల్లో రాణించాలి

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): యువత చదువుతో పాటు క్రీడలలో రాణించాలని మాజీ సర్పంచ్‌ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చిలప్‌చెడ్‌ మండలం గంగారంలో నిర్వహించిన క్రికెట్‌ టోర్నీ విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. గంగారం గ్రామ స్థాయి క్రికెట్‌లో బ్లూవేల్‌ జట్టు విజేతగా నిలవగా, రాయల్‌కింగ్స్‌ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతోనే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. యువత మొబైల్‌ గేమ్స్‌ కాకుండా, మైదానాలలో ఆటలు ఆడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

◆ ఒడిబియ్యం సమర్పణ

వెల్దుర్తి(తూప్రాన్‌): మండల కేంద్రంలోని గ్రామ దేవతలకు భవాని మాలలు ధరించిన భక్తులు శుక్రవారం ఒడిబియ్యం పోశారు. డప్పుచప్పుళ్లు, భజనలతో ఒక్కో ఆలయానికి చేరుకున్నారు. పాడి, పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని దేవతలను వేడుకున్నారు.

◆ వృద్ధులకు అన్నదానం

నర్సాపూర్‌: డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌ తన కుమారుడు జ్యోతిరాదిత్యగౌడ్‌ పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం విజన్‌ ఓల్డ్‌ ఏజ్‌ హోంలోని వృద్ధులకు అన్నదానం గావించారు. ఆపై పండ్లు పంపిణీ చేశారు. వారి సమక్షంలో జ్యోతిరాదిత్య కేక్‌ కట్‌ చేసి అందరికి పంచిపెట్టాడు.

◆ మందులు పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని కొట్టాల, మహ్మద్‌నగర్‌గేట్‌ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఏఎన్‌ఎం మజీదాబేగం మందులను పంపిణీ చేశారు. అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు వేశారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, కోడిగుడ్లు, పాలు ఆహారంలో ఎక్కువగా తినాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్‌ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా కుంకుమార్చన

నిజాంపేట(మెదక్‌): దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజైన శుక్రవారం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. నిజాంపేట్‌ మండలం కల్వకుంట.. రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

◆ కార్మికులకు దుస్తులు పంపిణీ

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మాజీ ఉప సర్పంచ్‌ కాళీదాస్‌ దంపతులు శుక్రవారం మండలంలోని కాళ్లకల్‌ గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. ప్రతీయేడు మాదిరిగానే ఈ ఏడాది కూడా వారికి దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. వారు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.